క్లుప్తంగా

మరాఠాలకు 12 సీట్లు కేటాయించాలి

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర జనాభాలో 27లక్షల మంది ఉన్న మరాఠా వారికి 12 సీట్లు కేటాయించాలని మరాఠా మహాసంఘ్ యువ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సప్తె శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మరాఠా వారిని ఏ పార్టీ ఆదరించలేదని, ఈసారి సామాజిక సమతుల్యత ప్రకారం మాకు రావాల్సిన సీట్లు ఇవ్వక అన్యాయం జరిగిందన్నారు. అన్యాయం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు.

ఆలయం మూసివేత



తాళం వేస్తున్న అర్చకుడు బాపూదేవ్

కెరమెరి: చంద్రగ్రహణం కారణంగా మండల కేంద్రంలోని శివాలయాన్ని శనివారం మూసి వేసినట్లు అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ తెలిపారు. నేడు (ఆదివారం) తెల్లవారు జామున 5 గంటలకు సంప్రోక్షణ చేసి ఆలయం తెరుస్తామన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ కేంద్రం సేవలు ప్రారంభం



ఆధార్ సేవలు అందిస్తున్న సిబ్బంది

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని డొనల్ ప్రాంతంలో ఉన్న సిర్పూర్(టి) పోస్టాఫీసులో శనివారం నుంచి ఆధార్ కేంద్రం సేవలు ప్రారంభమయ్యాయి. పోస్టాఫీసులో ప్రతీ ఒక్కరికి అన్ని విధాల ఆధార్ కేంద్రం సేవలు అందుతాయని, ఆధార్ మార్పులు చేర్పులు, నూతన ఆధార్ కార్డు తదితర సేవలను పోస్టాఫీసులో వినియోగించుకోవాలని పోస్ట్‌మాస్టర్ ఇందారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆధార్ కేంద్రంలో మార్పులు, చేర్పులతో పాటు నూతన ఆధార్ సేవలను వినియోగించుకున్నారు.

దహెగాంలో కోతుల బెడద



మండల కేంద్రంలో సంచరిస్తున్న కోతులు

దహెగాం: మండల కేంద్రంతో పాటు బీబ్రా, ఐనం తదితర గ్రామాల్లో కోతుల బెడద అధికంగా ఉంది. కోతులు గ్రామాల్లో సంచరిస్తూ ఇళ్ల పీకి పందిరి వేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందర వందర చేస్తున్నాయి. కొన్నిసార్లు మనుషులపై కూడా దాడులు చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సాలేగూడలో వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: వాల్మీకి అడుగుజాడల్లో నడవాలని సర్పంచ్ వినోద్ అన్నారు. శనివారం మండలంలోని సాలేగూడ గ్రామంలో వాల్మీకి 106వ జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు భీంరావు, సురేశ్, శ్రావణ్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

'ఆదివాసీలను పట్టించుకోని ప్రభుత్వాలు'

తలమడుగు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను పట్టించుకోలేదని తుడుందెబ్బ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇప్పటికీ ఆదివాసీ గ్రామాలకు రోడ్డు, తాగునీరు సౌకర్యం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై సవతి ప్రేమను చూపిస్తూ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రతిఒక్క ఆదివాసీ హక్కుల కోసం పోరాడాలన్నారు. అనంతరం మండలంలోని షేర్‌గుడ, షేక్‌గూడలో కుమురం భీం విగ్రహానికి నివాళులర్పించారు. తుడుందెబ్బ అధ్యక్షుడు భుజంగరావు, కార్యదర్శి పోచ్చన్న, రమేశ్, అశోక్, తోట వెంకటేశ్, అభిరాంరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల్లో 'మహాగాం'

- రోడ్డు లేక విద్యా, వైద్యానికి దూరం
- ఏ కాలమైనా కలుషిత నీరే దిక్కు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బావిలో నుంచి నీళ్లు తోడుతున్న మహిళలు



మహాగాం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి

వాంకిడి: దేశం అభివృద్ధి చెందుతున్నా మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. నేటి ఆధునిక యుగంలోనూ కొన్ని ఆదివాసీ గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. మండలంలోని సోనాపూర్ గ్రామ పంచాయతీ పరిధి మహాగాం గ్రామస్తులు విద్యా, వైద్యానికి దూరంగా ఉంటూ సమస్యలతో సహవాసం చేస్తున్నారు. మహాగాం (మచ్చగూడ) గ్రామంలో మొత్తం 15 కుటుంబాలు నివసిస్తుండగా 50 మందికి పైగా జనాభా ఉంది. గ్రామం వైపు వెళ్లే దారిలో ఉన్న పూనగూడలో 30 కుటుంబాలు ఉండగా 100కు పైగా జనాభా ఉంది. చిచ్‌పల్లి నుంచి సోనాపూర్ వెళ్లే మార్గం మధ్యలో మహాగాం వెళ్లేందుకు సుమారు 3 కి.మీల మేర పూర్తిగా మట్టి రోడ్డే ఉండగా, మార్గ మధ్యలో రెండు ఒర్రెలు ఉన్నాయి. దీంతో వర్షాకాలంలో ప్రజలు పడే ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

విద్యా, వైద్యానికి దూరంగా..

మహాగాం గ్రామంలో 5 నుంచి 10 ఏళ్ల పిల్లలు సుమారు 15 మంది ఉన్నారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు సుమారు 1.5 కి.మీల దూరంలో ఉండే పూనగూడ పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో పూనగూడ వెళ్లాలంటే సుమారు అర కిలోమీటరు ఒర్రె మీదుగా కాలి నడకనే వెళ్లాలి. దీంతో ఆ గ్రామ పిల్లలు విద్యకు దూరమై మేకలు కాసేందుకు, పంట చేలకు వెళ్తున్నారు. నేషనల్ హైవే నుంచి పంచాయతీ కేంద్రం సోనాపూర్ వరకు బీటీ రోడ్డు ఉండగా దశాబ్దాల కాలం నుంచి మహాగాం వరకు మట్టి రోడ్డే దిక్కుగా ఉంది. దీంతో వర్షాకాలంలో రాకపోకలకు తిప్పలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం అందక పలువురు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నట్లు గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు.

కలుషిత నీరే దిక్కు..

గ్రామంలో ఉన్న చేతిపంపు బోరింగులు పాడైపోగా గ్రామ సమీపంలోని ఓ బావి నీటినే తాగడానికి వినియోగించుకుంటున్నారు. ఏ కాలమైనా ఆ బావిలో నుంచి కలుషిత నీరే వస్తుండగా తాగునీటికి వేరే మార్గం లేక ఆ నీటినే తాగుతున్నారు. ఎండా కాలంలో అయితే తాగునీటికి అనేక కష్టాలు పడాల్సిన పరిస్థితి ఉంది. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణం చేపట్టి, పైప్‌లైన్లు వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. సుమారు మూడేళ్లుగా ట్యాంకు, పైపులు నిరుపయోగంగా మారాయని గ్రామస్తులు వాపోతున్నారు. కాగా గ్రామంలో త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ ఇస్తే పంట పొలాల్లో బోర్లు వేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు కోరుతున్నారు.

ప్రసిద్ధ మహాదేవుని ఆలయం..

గ్రామం సమీపంలోని ప్రసిద్ధ మహాదేవుని ఆలయం వద్ద ప్రతీ ఏడాది పొలాల అమావాస్య, హనుమాన్ జయంతి రోజున మొక్కులు తీర్చుకునేందేకు భక్తులు తరలి వస్తుంటారు. కానీ ఆలయంలో తాగునీటి సమస్య ఉంది. ఆలయం వరకు సరైన రోడ్డు నిర్మాణం చేపట్టి, నీటి సౌకర్యం కల్పిస్తే ఆలయానికి భక్తుల సందడి పెరుగుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం తప్పా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. గ్రామంలో తాగేందుకు మంచి నీళ్లు కూడా లేవు. అత్యవసర సమయాల్లో బయటికి వెళ్లాలంటే సరైన రహదారి లేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి.

– మూట మైసయ్య, గ్రామ పటేల్

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



ఆలయ ఆవరణలో అభివృద్ధి పనులు చేపడితే భక్తుల తాకిడి పెరుగుతుంది. గుడి వద్ద ఉన్న ఏకైక బోరింగ్ రెండు, మూడు బిందెలు నింపితే నీళ్లు అడుగంటిపోతున్నాయి. నీటి సౌకర్యంతో పాటు ఆలయం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి.

– బొర్కుటి జైరాం, ఆలయ పూజారి

భగీరథ నీరు అందించాలి



గుక్కెడు నీటి కోసం నానా తంటాలు పడుతున్నాం. చేతి పంపులు లేకపోవడంతో కలుషితంగా ఉన్నా బావి నీళ్లే తాగుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– మూట భీమక్క, గృహిణి

ఇష్టారాజ్యంగా మద్యం ధరలు పెంపు

- ఎన్నికల నేపథ్యంలో మద్యానికి డిమాండ్
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



రవీంద్రనగర్‌లోని మద్యం దుకాణం

చింతలమానెపల్లి: మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అబ్కారీ శాఖ పట్టించుకోక పోవడంతో నిబంధనలు ఉల్లంఘించి మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ మండలాలు చింతలమానెపల్లి, కౌటాలలో ధరలు పెంచడంతో మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాలలో బీరు బాటిల్‌పై రూ.10లు, లిక్కర్‌పై రూ. 20 నుంచి రూ. 50ల వరకు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలకు డిమాండ్ పెరుగుతుండడంతో మద్యం దుకాణాల నిర్వాహకులు అక్రమ సంపాదన పెంచుకోవడానికి ధరలు పెంచినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. మండలంలోని రవీంద్రనగర్ మద్యం దుకాణంలో ధరల పెంపుపై వినియోగదారులు నిలదీయగా నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. దీంతో మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం ధరలు అక్రమంగా పెంచి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయంపై ఎక్సైజ్ శాఖ సీఐ మంగమ్మను వివరణ కోరగా మద్యం ధరలను పెంచి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం దుకాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఘనంగా వర్షవాస్ ముగింపు



మాట్లాడుతున్న జాడి బాపు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శనివారం వర్షవాస్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, అంబేద్కర్ సెంటర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జాడి బాపు, లుంబిని దీక్ష భూమి అధ్యక్షుడు ముంజం మనోహర్ హాజరై మాట్లాడారు. బౌద్ధ మార్గంతో ఆధ్యాత్మికత అలవడుతుందన్నారు. అనంతరం బుద్ధ విహార్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథ పాఠకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు జైరామ్ ఉప్రే, బౌద్ధ సంఘం నాయకులు ప్రతాప్, రోషన్, రాకేశ్, సందీప్, అరుణ్, గంగుబాయి, విట్టుబాయి, వసుద, విఠల్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యంతో అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతగూడలోని కిరాణా షాపులో శనివారం ఆబ్కారీ అధికారులు తనిఖీలు నిర్వహించి ఎస్.ఆనంద్ అనే వ్యక్తి దుకాణం నుంచి 20 బాటిళ్లు ఆఫీసర్స్ ఛాయిస్, 19 బాటిళ్ల యునైటెడ్ గోల్డ్ మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. ఈజ్‌గాంలో 30 లీటర్ల తాటికల్లును సైతం జప్తు చేసినట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

పెంచికల్‌పేట్: సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రావి శ్రీనివాస్‌ను ఎంపిక చేయడంతో శనివారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయిరే బండు, ఘనపురం బాపూజీ, చంద్రయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాంలో

దహెగాం: సిర్పూర్(టి) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రావి శ్రీనివాస్‌కు టికెట్ రావడంతో మండల కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకుడు ఎల్క మోహన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బాణ సంచాలు కాల్చి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు తోగేశ్, గందె వెంకటేశ్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

గనులపై ఎన్నికల ప్రచారం నిషేధం



మాట్లాడుతున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన: సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ పార్టీలు, పార్టీలకు అనుబంధంగా ఉన్న ట్రేడ్ యూనియన్ నాయకుల ప్రచారాలను నిషేధిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ అన్నారు. శనివారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న గనులు, డిపార్టుమెంట్లపై ఎలాంటి రాజకీయ ప్రచారాలు చేయటానికి వీలు లేదన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

దహెగాం: మండలంలోని ఇట్యాల, రాళ్లగూడ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. కోత్మీర్ గ్రామానికి చెందిన సిద్దం సంతోష్ తండ్రి ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కొమురం గౌడ్, నాయకులు గజ్జెల సురేశ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



భీం చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఆదివాసీ సేన నాయకులు

తిర్యాణి: కుమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి అన్నారు. భీం 83వ వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని తాటిగూడ గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గణపతి మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన భీం పోరాట స్ఫూర్తి మరువలేనిదన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఆయన విగ్రహం ఏర్పాటు చేయలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టేకం రాంషావు, చిక్రం బాదిరావు, ఆత్రం రాజు, దౌలత్‌రావు, కుడిమెత భీంరావు తదితరులు ఉన్నారు.

భీం ఆశయాలను కొనసాగిద్దాం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదివాసీ ముద్దుబిడ్డ కుమురం భీం 83వ వర్ధంతిని శనివారం జిల్లా కేంద్రంలో నవజ్యోతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భీం విగ్రహానికి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ నిర్మాత, నటుడు, రచయిత దండనాయకుల సురేశ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సభ్యులు రాజశేఖర్, రామారావ్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, రమేశ్, రాధాకృష్ణచారి, విజయ్‌కుమార్, మానస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం 83వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గేడం, టీకానంద్‌లు మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసిన వారిని సమాజం ఏనాటికి మర్చిపోదన్నారు. నాయకులు శ్రీకాంత్, కృష్ణమాచారి, లలిత, శ్రీలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: కుమురంభీమ్ వర్ధంతి పురస్కరించుకొని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్‌తో కలిసి శనివారం జోడేఘాట్‌లోని భీమ్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమ్ మనమడు సోనేరావును శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్, కార్యకర్తలు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: కుమురం భీం ఆశయాల సాధనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కుమురం భీం వర్ధంతి సందర్భంగా శనివారం కౌటాలలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గొప్ప యోధుడు కుమురంభీం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచ్ మౌనిశ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బ్రహ్మయ్య, నాయకులు పోశం, సదాశివ్, హన్మంతు తిరుపతి, వసంత్‌రావు, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: భీం వర్ధంతి వేడుకలను శనివారం కాగజ్‌నగర్‌లో పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్‌సిల్క్ కాలనీలో బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ హరీశ్ బాబు కొమురం భీం చిత్రపటానికి నివాళులర్పించారు.



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నవజ్యోతి సంస్కృతి సభ్యులు



భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



కౌటాల: భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

జోడేఘాట్‌లో రెండే స్టాళ్లు



కొనసాగుతున్న మెడికల్ క్యాంపు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఐటీడీఏ అధికారులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో శనివారం కుమురం భీం వర్ధంతి సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల విభాగం, మెడికల్ క్యాంపు స్టాళ్లను ఏర్పాటు చేశారు. గతంలో సుమారు 10 శాఖలకు చెందిన స్టాళ్లు ఏర్పాటు చేయగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈసారి రెండే స్టాళ్లు ఏర్పాటు చేశారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

దహెగాం: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తనయుడు కోనేరు వంశీ రెండో రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మార్కెట్ ఏరియాలో దుకాణాల వద్ద సైతం ప్రచారం నిర్వహించారు.

విజయవంతం చేయండి

బోథ్: డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. హుస్సేన్ అన్నారు. శనివారం కోర్టు పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించారు.